# సుందర దృశ్యం

"ఒరేయ్ డియర్ రవీ !

"మొన్న నేం జరిగిందో తెలుసా? మొన్న అంటే పది రోజుల క్రిందట బస్సులో ఓ సుదూర ప్రాంతానికి వెళ్ళి వస్తున్నాను. కిటికీ పక్కనే కూర్చుని బస్సులోంచి చూసున్న నాకు ఒక సుందర దృశ్యం కనిపించిందిరా. అ దేమంటావా?

"మా బస్సు విశాలమైన రోడ్డున పోతూ ఉంటే రోడ్డు పక్కగా బారులు తీర్చి స్త్రీలు రకరకాల సోయగాలతో చేతిలో కడవలు, బిందెలు పట్టుకుని రోడ్డుకి పక్కనే ఉన్న మామిడి తోటలోని బావి దగ్గరకు వెళ్తున్నారు. కొందరు బావి నుంచి వస్తూ, బావి వైపు వెళ్తున్నారు. వారు దారి నెంత అంత అందంగా అలంకరించా రనుకున్నావ్? బావి చుట్టూ స్త్రీలు - నీళ్ళు చేసే నవ్వడి బిందెలు, కడవలు నెత్తిపైన ఎత్తుకునేటప్పుడు వినిపించే గాజుల గలగలలు. తలపైన కడవను పెట్టుకుని, ఎడమ చేతిని కడవ మీ దుంచి, కుడిచేత్తో చీర కుచ్చెళ్ళను సుతారంగా పట్టుకుని కొందరు హంస నడకలు పడస్తుంటే, ఎడమ భుజాన బిందె నుంచుకుని, ఎడమ చేతిని నడుము మీదుంచుకుని, తలను ఒక పక్కకు వంచి, చీర కుచ్చెళ్ళను నడుమున దోపి, మరి కొందరు నడయాడుతుంటే, కొంతమంది నడుముపైన బిందెల నుంచుకుని కుడి చేతిలో చీర కుచ్చెళ్ళను పట్టుకుని మందగామినులై నడుస్తుంటే - ఆ తోట పరిసర ప్రాంత మంతా ఎంత సుందరంగా కనిపించిం దుకున్నార్? బృందావనమే దిగివచ్చిందా అని అనిపించిందనుకో.

"వారంతా నడుస్తుంటే ప్రాణమున్న శిల్పాలు కదలి వస్తున్నాయా అనిపించింది. తడిసిన బట్టల్లో వారి సోయగాలు వర్ణించటం నాకు చేతకావటం లేదు. అలా వారు వాళ్ళ పల్లెకి (అక్కడి నుంచి నాలుగు ఫర్లాంగుల దూరంలో వారి ఊరుందట.) నడిచిపోతుంటే, అది మండు టెండైనా వెన్నలని కురిపిస్తున్నారా దారినంతా అనిపించిందనుకో. నేనే గాని చిత్రకారుడినై ఉంటే ఆ సుందరుల్నీ, ఆ అందాలనీ, ఆ సుందర దృశ్యాన్నీ చిత్రించేవాడినే కదా అనిపించింది. ఇదంతా నీ కెందుకు రాస్తున్నానంటే నీవు భావకుడివి కదా! నీవూ ఇక్కడికి వస్తే నీకూ ఆ మనోహర దృశ్యాన్ని చూపిద్దామని. ఆలస్యం చేయక వస్తావు కదూ?

"నీ మిత్రుడు
"రాజు"

"మై డియర్ రాజూ!

"నీ ఉత్తరం అందింది. నీవు చూసిన దృశ్యం ఎక్కడో అపురూపంగా లేదు. అన్ని చోట్లా నీకా దృశ్యాలు కనిపిస్తాయి. బస్సు కిటికీలోంచి ఫ్రేము కట్టినట్టు నీకు

కనిపించిన ఆ దృశ్యం - వారి జీవితా వసరాలను ఫ్రేము కట్టి చూపిస్తోం దన్న విషయం గమనించు. నీకు సుందరంగా కనిపించిన ఆ దృశ్యం ఎంతమాత్రం సుందరం కాదు! మనోహరం కాదు! మనోజ్ఞం అంతకన్నా కాదు! నిత్య జీవితావసరాలలో ముఖ్యమైన నీటి కోసం వారు చేసే భగీరథ ప్రయత్నమే అది.

"నీ ఉత్తరంలో అన్నావు - ఆ బావి ఊరికి నాలుగు ఫర్లాంగుల దూరంలో ఉందని, బిందెడు నీటి కోసం ఊరు ఊరంతా అన్వేషించుకుంటూ అంత దూరం నుంచి వస్తున్నారంటే ఆ ఊరు నీటికి ఎంత గొడ్డుపోయిందో నీ కర్థం కాలేదూ? దూరాభారాలు సహిస్తూ, కాళ్ళు పీక్కుపోతున్నా లెక్క చేయక నీటిని మోసుకొస్తుంటే ఆ అభాగ్యులలో నీవు చూసే అందం ఎలాంటిదని చెప్పమంటావు? వారి నడకల్లో హొయలు, వారి శరీర కదలికల్లో సోయగాలూ కనిపించాయానీకు? అవునులే! నీ కేనాడూ ఈ కష్టం ఎదురై ఉండదు కదా! బస్సులో కూర్చున్న నీకు అది వెన్నెలేమో గాని, అది నూటికి నూరుపాళ్ళూ మండు టెండే బ్రదర్!

"తడిసిన శరీరాల సోయగాలు" అని అన్నావు. అవి నీటికి తడిసిన శరీరాలు కావు బ్రదర్! అవి శ్రమకు తడిసిన శరీరాలు! శ్రమలో నలిగిన శరీరాలు. చెమటలో అలసిపోతూ అంత దూరం నుంచి మోసుకొచ్చే నీటిలో ఒక్క బిందువును కూడా వృథాగా చిందించడానికి వారు సాహసించరు బ్రదర్! ఒక్క నీటి బిందె కోసం వారు పడే తహతహ, ఆందోళన, వారి ముఖాల్లో నీకు కలిపించలేదూ?

"అవునులే! వారి నుదుటి మీది చెమట బిందువులే ముత్యాలుగా కనిపించే నీకు, వారి వ్యథ ఎలా అర్థ మవుతుంది? ఒక భుజాన బిందెనెత్తుకుని, మరో చేత్తో పసిబిడ్డని మోస్తూ భారంగా కదిలే ఏ తల్లీ నీ కాసుందర దృశ్యంలో కనిపించలేదా? మండు టెండలో వెంట చీరకొంగు పట్టుకుని వచ్చే బిడ్డల్ని సముదాయిస్తూ, గంగను తలపైన మోస్తూ వచ్చే స్త్రీలు నీకు కనిపించలేదూ? చెప్పు బ్రదర్! అది సుందర దృశ్యమా? మనోహర దృశ్యమా! కవులు రచించగల మనోజ్ఞ కావ్యమా? "ఆలోచించు

"రవి"

* * *